క్లుప్తంగా

ఘనంగా వారాల పండగ


అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో చొక్కాపు వీధి వాసులు దేశతల్లి అమ్మవారి వారాల పండగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గ్రామ పొలిమేరలకు చేరుకుని పూజలు చేశారు. అమ్మవారికి పరమాన్నం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండేలా చూడమని అమ్మవారిని కోరుకున్నారు.

మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న రామినాయుడు


బొబ్బిలి: మాజీ సైనికులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బొబ్బిలి మాజీ సైనికుల సంఘం గౌరవా ధ్యక్షుడు మరడ రామినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సంఘ కార్యాల యంలో మాజీ సైనికులతో సమావేశం నిర్వహించారు. మాజీ సైనికుల ఇబ్బందులపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సంవత్సరాల పాటు సేవలందించిన సైనికులకు రిటైర్ అయ్యాక ఇళ్ల స్థలాలు కాని, ఉపాధి అవకాశాలు కాని దొరకడం లేదని అన్నారు. మాజీ సైనికుల సమస్యలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కోశాధికారి వి.ఎస్.శర్మ పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: శిష్టకరణాల బొబ్బిలి సంఘ సర్వసభ్య సమావేశాన్ని ఆ సంఘ అధ్యక్షుడు వంతరాం శ్రీరామమూర్తి స్వగృహం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది పెదపెంకి శివప్రసాద్, అధ్యక్షుడిగా వంతరాం శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నిడగంటి ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.శ్రీనివాసపట్నాయక్, ఉపాధ్యక్షులుగా పట్నాయకుని వేణుగోపాలరావు, కుప్పిలి నాగరాజేశ్వరరావు, అదనపు కార్యదర్శిగా పి.రత్నాకర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకో వాలన్నారు. పాఠ్య పుస్తకాలతోపాటు కథలు, ఇతిహాసాలు, నవలలు, శాస్త్ర,సాంకేతిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు చదవాలన్నారు.

ప్రకటనలకే పరిమితం..!

- కార్యరూపం దాల్చని చిలకపాలెం -రామభద్రపురం మీదుగా రాయగడ రోడ్డు విస్తరణ
- పీపీపీ విధానంలో నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు
- ఏడు నెలల క్రితం రోడ్డును పరిశీలించిన ఎంపీ కలిశెట్టి
- ఇప్పటి వరకు ఒక్క అడుగూ ముందుకు పడని వైనం


రామభద్రపురం-రాజాం రోడ్డు


రామభద్రపురంలోని గాంధీ బొమ్మ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు (ఫైల్)

రామభద్రపురం:

నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే శ్రీకాకుళం జిల్లాలోని చిలకపాలెం నుంచి రామభద్రపురం మీదుగా రాయగడకు వెళ్లే రోడ్డును నాలుగు వరుసల రహదారిగా ఆధునికీకసరిస్తామంటూ పాలకులు చేసిన ఆర్భాటం అంతా ప్రకటనలకే పరిమితం కానుందా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ఉన్నతీ కరణకు కసరత్తు చేస్తున్నాయి. అందులో భాగంగానే శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి రామభద్రపురం మీదుగా రాయగడ వరకు 134.40 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని పీపీపీ విధానంలో నాలుగు వరుసల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం 7 మీటర్ల వెడల్పుతో ఉన్న రోడ్డును 30 మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసలు రోడ్డుగా విస్తరించేందుకు ప్రతిపాదించి, పీపీపీ విధానంలో డీపీఆర్ తయారీకి కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచినట్లు సమాచారం. అయితే ఈ ఏడాది జనవరి 26వ తేదీన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రామభద్రపురం వచ్చి బైపాస్‌లోని గాంధీ బొమ్మ సెంటర్‌ను పరిశీలించారు. చిలకపాలెం నుంచి రాయగడ వరకు నాలుగు వరుసల రోడ్డు వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని ఎంపీ ప్రకటించి వెళ్లిపోయారు. రోడ్డు విస్తరణ దిశగా ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు.

పలు దఫాలుగా ప్రతిపాదనలు

రామభద్రపురం మండల కేంద్రం అంతరరాష్ట్ర కూడలి కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ రహదారిని విస్తరిస్తారమనే మాట పాలకు లు, అధికారుల నుంచి దశాబ్దాలుగా వినిపిస్తూనే ఉంది. సంబంధిత అధికారులు పలుదఫాలుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈమా ర్గంలో ప్రయాణించే వాహనాల సంఖ్య, ఇతర వివరాలు సేకరించి, రోడ్డు విస్తరణకు అన్ని అనుకూలతలు ఉన్నాయని తేల్చారు. రోడ్డు విస్తరణ జరిగితే ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు మెరుగుపడడంతో పాటు ఆర్థిక,సామాజిక, వాణిజ్య రంగాల్లో అభివృద్ధికి దోహదపడుతుంది.

బైపాస్ ఇచ్చేందుకు ఆలోచన..?

రామభద్రపురం మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా దుకాణాలు పెట్టుకుని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మండల కేంద్రం మీదుగా రోడ్డును విస్తరిస్తే వందలాది కుటుంబాలు నిరాశ్రయులవుతారని సంబంధిత అధికారులు ఉన్నతాధికారులకు చెప్పినట్లు సమాచారం.దీంతో మండలంలోని మర్రివలస పక్క నుంచి బైపాస్ ఇచ్చి మండల కేంద్రాన్ని తప్పిద్దామనే ఆలోచనతో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.


డీపీఆర్ తయారవుతోంది



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర రహదారులను పీపీపీ విధానంలో జాతీయ రహదారులుగా ఆధునికీకరించనున్నాయి. చిలకపాలెం నుంచి రామభద్రపురం మీదుగా రాయగడ వరకు రోడ్డును ఆధునికీరించేందుకు కసరత్తు జరుగుతోంది. టెండర్లు పూర్తయినట్లు ఉన్నతాధికారులు చెప్పారు. ప్రస్తుతం డీపీఆర్ తయారవుతోంది. నాలుగు వరుసల రోడ్లా లేక రెండు వరుసల రోడ్లు వేయాలా, లేక బైపాస్ రోడ్డు ఇస్తారా అన్న వివరాలు డీపీఆర్‌లో పేర్కొంటారు. – ప్రణయ, ఆర్అండ్‌బీ జేఈఈ, బొబ్బిలి

ఈ మాయమాటలు ఇంకెన్నాళ్లు బాబు..?

- 50 ఏళ్లు దాటినవారికి పింఛన్ ఇవ్వాలి
- విలేకరుల సమావేశంలో డాక్టర్ తలే రాజేష్


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు తన మాయమాటలతో ప్రజలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ప్రశ్నించారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లు దాటిన బీసీలు, అణగారిన వర్గాల వారికి సామాజికి పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్‌తో పాటు అనేకహామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ఆహామీలు అమలులో విఫలమవుతోందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రతీకార చర్యలు, ప్రతిపక్ష నాయకులను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. 50 ఏళ్లు దాటిన వారందరికీ పింఛన్ ఇస్తామన్న హామీని ఎన్నాళ్లు వాయిదా వేస్తారని ప్రశ్నించారు. వితంతువులకు ఎందుకు కొత్త పింఛన్లు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ ఆరు నెలలకు ఒక పర్యాయం కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చేదని, ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఒక్కరికి కూడా కొత్తగా పింఛన్, ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. ఏడాదికాలంలోని కూటమి పాలనపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత కనిపిస్తోందని, మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు, నీటి సరఫరా కార్మికులు సమ్మె బాట పట్టారని, వార్డు, గ్రామ సచివాలయాల ఉగ్యోగులు నిరసనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించి, ప్రజా సంక్షేమానికి పాటు పడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సంతకవిటి: మండలంలోని పొనుగుటువలస గ్రామ సమీపంలో వరలక్ష్మి నగర్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన ఎద్దుబోయిన రామలక్ష్మికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు... ఎద్దుబోయిన రామలక్ష్మి, గోవింద్ దంపతులు ద్విచక్ర వాహనంపై మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వారి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరలక్ష్మికి గాయాలయ్యాయి. బాధితురాలు వరలక్ష్మి ఆదివారం ఇచ్చిన ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పరీక్షల ఫీజు చెల్లించేందుకు జూలై 15 వరకు గడువు

రాజాం: చెన్నైకు చెందిన దక్షిణభారత హిందీ ప్రచార సభ నిర్వహించే హిందీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు జూలై 15వ తేదీ వరకు గడువు ఉందని రాజాంకు చెందిన హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకు గల ఈ పరీక్షలు సెప్టెంబర్‌లో జరగనున్నాయని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9949917365ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలిరూరల్: రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికపై నియోజక వర్గంలోని మహిళా సర్పంచ్‌లకు ఈనెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బా డంగి,తెర్లాం,రామభద్రపురం,బొబ్బిలి మండలాల మహిళా సర్పంచ్‌లు ఉదయం 9 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవర ణలోని వెలుగు కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

యూపీ స్కూళ్లలో వెంటనే టీచర్లను నియమించాలి


మాట్లాడుతున్న జేసీ రాజు

బొబ్బిలి: ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీ, తెలుగు భాషలను బోధించే ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జోనల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు జీతాలను నిర్ణీత కాలంలోనే చెల్లించాలన్నారు. అలాగే పీఆర్సీ, డీఏల బకాయిలను తక్షణం విడుదల చేయాలని, మెగా పేరెంట్స్ డేను వాయిదా వేయాలని కోరారు. బడి బయట పిల్లల గుర్తింపు, పాఠశాలల్లో విద్యార్థులను చేర్చడానికి సంబంధించి మే నెలలో నిర్వహించాల్సిన డ్రైవ్‌ను ఇప్పుడు నిర్వహించడంలో అర్థం లేదన్నారు. అందరూ ప్రైవేటు పాఠశాలలు, వసతి గృహాలలో చేరాక ఈ డ్రైవ్ నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు ఆర్.ఎస్.రాజు, చిన్నారావు, బి.డి.దర్శనం పాల్గొన్నారు.

వెలుగు ఏసీకి బదిలీ


ఏ.చిరంజీవి

రాజాం: డీఆర్‌డీఏ, వెలుగు రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ ఏ.చిరంజీవికి ఇటీవల నిర్వహించిన బదిలీల్లో విజయన గరం డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం జిల్లా ఐబీ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యింది. ఈయన మూడేళ్లుగా ఇక్కడ ఏసీగా విధులు నిర్వర్తించారు. విజయన గరం బదిలీ అయినప్పటికీ ప్రస్తుతానికి రాజాం ఇన్‌చార్జ్ ఏసీగా ఆయనే కొనసాగనున్నారు.

క్లాప్‌మిత్రలకు బకాయి వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి సురేష్, క్లాప్ మిత్రలు

బాడంగి: గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజారోగ్యం కాపాడుతున్న క్లాప్ మిత్రల (గ్రీన్ అంబాసిడర్ల)కు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని సీఐటీయూ మండల కార్యదర్శి ఏ.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వాడాడ గ్రామంలో క్లాప్ మిత్రలతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాడాడ గ్రామంలో పని చేస్తున్న క్లాప్‌మిత్రలకు ఏడాదిన్నరగా వేతనాలు ఇవ్వలేదని, వారి కుటుంబ పోషణ సాగేదెలా అని ప్రశ్నించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ క్లాప్ మిత్రలకు ఆరు నెలల నుంచి ఏడాది వరకు వేతనాలు బకాయి ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు జమ చేయాలని, లేకుంటే కార్మికుల తరఫున సీఐటీయూ పోరాటం చేస్తుందని చెప్పారు.

వైభవంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక హవనం చేసి పూర్ణాహుతి జరిపించారు. తరువాత స్వామి వెండి మంటపం వద్ద శ్రీ సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు.

వాహన తనిఖీలు


వంగర: మడ్డువలస జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్


తెర్లాం: తెర్లాం జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న ఏఎస్‌ఐ భాస్కరరావు

వంగర: మండలంలోని మడ్డువలస జంక్షన్ వద్ద ఎస్‌ఐ షేక్ శంకర్ ఆదివారం వాహన తనిఖీలు చేశారు. వాహన పత్రాలు, వాహన చోదకుల లైసెన్స్‌లు పరిశీలించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన ఇద్దరు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, మద్యం తాగి వాహనం నడిపినా కేసులు తప్పవన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

తెర్లాం: మండల కేంద్రంలో ఎస్‌ఐ సాగర్ బాబు ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ భాస్కరరావు, పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేశారు. వాహన పత్రాలు, లైసెన్స్ లేని పలువురు వాహనచోదకులకు అపరాధ రుసుం విధించారు. ఈసందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఆదివారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్మికులు మాట్లాడుతూ గత 54 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలైన విద్యుత్, తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నా తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నా. రెండు సార్లు ఛలో విజయవాడ, ఛలో సీడీఎంఏ ఆఫీస్ ముట్టడి వంటి కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం ఇంకా మొండిగా వ్యవహరిస్తుందోని, కార్మికులపై వీరికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని పేర్కొన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు సీహెచ్.రామ్మూర్తినాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్, మరియదాసు, కృష్ణ, శ్రీనివాసరావు, గణపతి, శారద, లక్ష్మి, ప్రసన్న, ఆశాలత, సత్యనారాయణ, సోమేష్, మోహన్, రామకృష్ణ, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.